# 5

## పాటకచేరి

1 ఒకరోజు మధ్యాన్నం అమలాపురంసత్రంలోంచి నలుగురుమనుషులు బయలుదేరారు. అందులో ముందరనడిచే ఆయన గురువులాగు కనపడుతున్నారు. బంగారంచుట్టిన రుద్రాక్షకాయ మెళ్ళోనూ, ఎండా కాలమైనా బుజంమీద శాలువా, అధికారం సూచించే మొహంమడతలూ ఆయనకి అధ్యక్షత నిస్తున్నాయి. ఇంకొకడు తాంబూరా, ఫిడేలూ పట్టుకున్నాడు. వాడే శిష్యుడు. అయిదేళ్ళనించి సంగీతం నేర్చుకోగా నేర్చుకోగా, పాటకచేరీలలో తాళం వెయ్యగా వెయ్యగా గురువుగారు శ్రుతి పెట్టియిస్తే, తాంబూరామీటడం వొచ్చింది యిప్పటికి. ఈ జన్మలోగాని, యింక వొచ్చే అయిదారు జన్మలకుగాని, అతనికిగాని, అతనితో రక్తసంబంధమున్న యింకెవరికిగాని సంగీతం రాదని గురువుకీ తెలుసు, శిష్యుడికీ తెలుసు. కాని రోజూ గురువూ, అతనూ సంగీతం నేర్పుతున్నట్టూ, నేర్చుకుంటున్నట్టూ ఒకగంట నాటకమాడి సంతోషిస్తో వుంటారు. అదిగాక యీ శిష్యుడు తెల్లారకట్ట నాలి

గింటికే లేచి సాధన చేస్తోవుంటే, చుట్టుపక్కల కుక్కలు కుయ్యో మొర్రో అని శ్రుతి కలిపి అరిచి అందరి నిద్రనీ చెడగొట్టేవి. వూళ్లో పెద్దమనుషులు కొందరు చేరి, అతనికి సిఫారసు చేసి, పోరుగూరులో కరిణీకం యిప్పిస్తామన్నారుగాని, అతను సంగీతం వొదిలిపెట్టడానికి వొప్పుకోలేదు. మూడో ఆయన చంకలో మద్దెల పెట్టుకున్నాడు. నాలుగో ఆయన వూరికే చేతులు జోడించుకుని వెంటనడుస్తున్నాడు. అతనికిమాత్రం ఒక కోటు, దానికి మూడు జేబులూ ఉన్నాయి. ఆయనకీ, సంగీతానికీ సంబంధం యేమీ లేదు. అయినా వీళ్ళ వెంబడి అప్పులవాడిమల్లే తిరుగుతో వుంటాడు. పాట కచేరీల్లో తల వొకటే వూయిస్తాడు. అప్పుడప్పుడు పరవశత్వం యెక్కువై, చుట్టుపక్కల వాళ్ళమీద దొర్లడం, ఉన్నట్టుండి తెలియనివాళ్ళ వీపుమీద తటాలున చరచడం, యెవరన్నా సంగీతం వినకుండా మాట్లాడుతోవుంటే, వాళ్ళకంటె బిగ్గరిగా అరవడం యీయన దుర్గుణాల్లో ముఖ్యమైనవి. ఒకసభలో డిప్టీకలెక్టరుగారి వీపుమీద చురుక్కున కొట్టి, 'బలే బలే' అనేప్పటికి, ఆయన అదిరిపడి 'పోలీసులు, పోలీసులు' అని కేక లేశాడు. ఈ పనిలేని ఆయన యెక్కడివాడో, యెందు కిటా వీళ్లతో తిరుగుతాడో యెవరికీ తెలీదు.

వీళ్ళు మెల్లిగా నడుచుకుంటో వెళ్ళి టవును హాలు చేరుకున్నారు. ఒకరూపాయీ, రెండు రూపాయలూ రేట్లు పెట్టి, వీళ్ళ పాటకచేరి అవాళ. అప్పుడు

నాలుగున్నరయింది. ఈ నలుగురూ ప్లాటుఫారమెక్కి, శ్రుతి చేసుకుంటున్నారు. అయిదున్నరయింది. వెనక ఒకరూ, ముందు యిద్దరూ కూచుని వున్నారు. శిష్యుడు వెళ్లి బయట చూశాడు. ఒకరూ కనపడలేదు. ఆరున్నరదాకా, ఆ ఫిడేలూ, మద్దెలా ముందుపెట్టుకు కూచున్నారు. ఇంకా ఆరుగురు వొచ్చారు, పావుగంట కొకరు చొప్పున. యీ లోపల యిదివరకు వొచ్చినవాళ్లల్లో వొకరు విసుగెత్తి తిట్టుకొంటూ వెళ్లిపోయినారు. గాసు లైట్లు నాలుగు వొచ్చాయి. ప్రేక్షకుల్లో వొకరు "పాడుతో వుంటే విని చాలామంది వొస్తారు. ప్రారంభించండి" అన్నారు. మొదట భైరవివర్ణం. అయిదారు నిమిషాలు పాడారు. ఇద్దరు ముందుకూచున్నవాళ్ళు వెళ్లిపోయినారు. పావుగంటలో యిద్దరు గాఢనిద్రపోయినారు, ఒకరిమీదికి ఒకరు వొరిగి. యింకొకడు ఆవలిస్తున్నాడు. ఇంకో ముసలాయన విసుక్కుంటూ గొణుక్కుంటూ కూచున్నాడు. నల్లకోటూ, పచ్చ టై వేసుకున్న ఇంకో పెద్దమనిషి తన భార్యపోయిన సాయంత్రం జ్ఞాపకం తెచ్చుకొని, తన వొంటరితనానికి తనే దిగులుపడుతో కళ్లనీళ్లు పెట్టుకుంటున్నాడు. ఇంకా యిద్దరు ఒకరి మొహాలు ఒకరు చూసుకుని, నవ్వుతో బైటికి పరిగెత్తారు. గురువుగారు సంగీతం ఆపి, ఫిడేలు ముందు పెట్టారు. నలుగురిలో పనిలేని ఆయన లేచి,

"యీవూళ్లో యెవరికీ సంగీతంమీద అభిమానం లేనట్టుంది. ఇటువంటి అద్వితీయులైన విద్వాంసులు

వొస్తే వినడానికి యే నలుగురో వొచ్చారు. యిట్లాంటి సంగీతం వినే అదృష్టం యీ జన్మలో మళ్లీ తటస్థిస్తుందా? వొచ్చినవాళ్లుకూడా సంగీతం అర్థమయ్యే వాళ్లలాగు లేరు. మీఖర్మం" అన్నాడు.

నల్లకోటాయన లేచి చాలా విచారంతో, యేడుస్తున్న కంఠంతో, కన్నీళ్లు తుడుచుకొంటూ "కచేరి అయిపోయిందా?" అని అడిగాడు.

"అయితే మా టిక్కెట్ల డబ్బు యిచ్చెయ్యండి, పోతా"మని ఆవలించే ఆయన అన్నాడు.

"ఇచ్చిన డబ్బు తిరిగి యిస్తారా?" అన్నాడు పని లేనిఆయన.

"అయితే పాడండి" అన్నాడు, పుష్యరాగాల అంటుజోళ్ల కోమటి. వూరివారందరూ వొస్తారనీ, తన సంగీతాభిలాషా, రసికత్వమూ చూస్తారనీ, రెండు రూపాయలుపెట్టి టిక్కెట్టుకొని వచ్చాడు. లెఖ్ఖవేసి చూస్తే అప్పటికి అణాన్నర సంగీతమన్నా కాలేదు. అతని తమ్ముడిపెళ్లికి పదిహేనురూపాయలిచ్చి, నాలుగు గంటలసేపు పాడించారు. ఒక దురదృష్టవంతుడిచేత.

పనిలేనిఆయన గురువుగారివంక భక్తితో చూశాడు.

"చెవిటివాళ్ళకీ, దున్నపోతుకన్నా నా సంగీతం పాడతాగాని, యిక్కడ నాముందు వీళ్ళున్నంతసేపూ ఫిడేలుమీద చెయ్యివెయ్యను" అన్నాడు గురువు.

శిష్యుడుమాత్రం, ఆపాలో లేదో తెలియక, తాంబూరా మీటుతోనేవున్నాడు. దాంతో వాళ్ళకి

కోపమొచ్చి "మా డబ్బు మాకియ్యండి" అని నలుగురూ అరిచారు. నిద్రపోయినవాళ్ళలో ఒకరు యీ అరుపులు విని లేచి, వేసిసంగీతానికి తలవూయించడం మొదలుపెట్టాడు. పనిలేనిఆయన గురువుగారి అనుజ్ఞ తీసుకొని యెవరిడబ్బు వాళ్ళకి యిచ్చేసి, 'యింక పొండి' అన్నాడు. వాళ్లు ఆ నిద్రపొయ్యే ఆయన్ని వూయించి వూయించి లేపుకొని తీసుకుపోతున్నారు. ఆయన "నాకు వొకటే పీడకలలు వొచ్చాయి. ఇంటి దగ్గిరికి వెళ్ళడమంటే భయమేస్తోంది" అంటున్నాడు. తలతిప్పేఆయన నడుస్తున్నా సగంనిద్దట్లో "వెంకీ, యెందుకే అట్లా తిడతావు?" అంటున్నాడు.

2 టిక్కట్ల డబ్బు వాపసు చేస్తున్నారని తెలిసి సగంలో వెళ్ళిపోయినవాళ్ళు కొంతసేపట్లో తిరిగివొచ్చారు. పాట జోరుగా వినపడుతోంది. హాలు తలుపులూ, కిటికీలూ బార్లా తీసివున్నాయి. లోపల నాలుగుమూలలా నాలుగు గాసులైట్లు తెల్లగా వెలుగుతున్నాయి. ప్లాటుఫారంమీద గురువుగారు పాడుతో ఫిడేలు గిరగిర వాయించేస్తున్నారు. శిష్యుడు కునికిపాట్లు పడుతున్నాడు; గాని వేళ్లు తాంబూర తీగెల మీద కదులుతూనే వున్నాయి. అయినా యెప్పుడు గురువుగారి వెనకాలే తాంబూరా, అతనూ మీద దొర్లుతారో అని చూసేవాళ్లకి భయంగా వుంది. మద్దెలఅతను చేతులు కనపడకుండా బాదేస్తున్నాడు. కొంచెం వేగం తగ్గినప్పుడుమాత్రం, ఆ జుట్టుముడి,

మొహంచుట్టూ పడడంచేత, నాటకంలో హిరణ్యకశిపుడిలాగు కనపడతాడు; పనిలేనిఆయన తల అతి వేగంగా వూయించాడు. తలలేని మొండెంవలె చూసే వాళ్ళకి బెదురుకలుగుతోంది. వాళ్ళముందు కుర్చీల్లోనూ, బెంచీలమీదా వొక్కరూ లేరు. ఒక పిచిక మాత్రం దూలం తొర్రలోంచి తల పైకెత్తి బెదురుతో చూస్తోంది. ఒక గబ్బిలం గుండెలూ రెక్కలూ కొట్టుకొంటూ ఆశబ్దంనించీ, వెలుతురునించీ తప్పించుకోలేక తడుములాడుతోంది. యీ వొచ్చిన వాళ్లు యేంచెయ్యడానికీ తోచక నుంచున్నారు. ఒకడు ధైర్యంచేసి దగ్గాడు; కాళ్లు చరిచాడు; 'రామం డోయ్' అని అరిచాడు. వాడి గొంతుక శబ్దం వాడికే వినపడలేదు. దానితో వాడికి భయంపుట్టి పక్కనున్న వాడి నడుం కావిలించుకొన్నాడు. వెనకనున్న జుక్కల కుర్రవాడు ధైర్యంచేసి ముందరికి వొచ్చి, తలలేని ఆయన జబ్బ పట్టుకుని వూయించాడు. రెండో చెయ్యి కుర్రాడిచెయ్యిని లాగేసిందిగాని, తలమాత్రం కనపడనే లేదు. తల ఆపైన యెక్కడో వుండాలని వూహించి చేతు లడ్డపెట్టి పట్టుకున్నాడు. అప్పు డా పనిలేని ఆయన కళ్లు తెరిచి, కలలోంచి మేలుకున్నవాడి మల్లే నిదానించి అయిదు నిమిషాలు చూసి,

'ఏమిటి?' అని అడిగాడు మెల్లిగా.

"మాటెక్కట్లడబ్బు" అన్నారు.

ఒక్కనిమిషమైనా మాట్లాడానికి జీవితంలో వ్యవధి లేనట్లు, తన రొంటినివున్న రూపాయలసంచి

వాళ్ళమీద పారేసి, మళ్ళీ తల కనబడకుండా తిప్పే స్తున్నాడు. ఒవరిడబ్బు వాళ్లు తీసుకుని, మిగిలింది కూడా సమానంగా పంచుకుని, అర్ధరూపాయి మిగిలితే దాన్ని మార్చుకుందామని, వృత్తసంచీ అక్కడ పారేసి వాళ్లు వెళ్ళిపోయినారు.

ఫిడేలు కమాను మెగిరిపోతోంది. మద్దెల మోగిపోతోంది. తల తిరిగిపోతోంది. గాసులైట్లు వెలిగిపోతున్నాయి. సంగీతమాధుర్యం కొనుహాలుం చుట్టూ వున్న యిసుకపర్రలో యింకిపోతోంది. వూరు నిశ్చింతగా నిద్రపోతోంది. శిష్యుడు నిద్రపోతున్నా వేళ్లు కదులుతోనేవున్నాయి. క్లబ్బుజమాను తలుపు మయ్యటానికి వొచ్చి, ఏమీతోచక, నుంచుని నుంచుని అట్లానే తలుపుప్రక్కన నిద్రపోయినాడు.

తెల్లారకట్ట మూడున్నరకి ధన్యాసిరాగం మొదలుపెట్టారు. కోళ్లూ కాకులూ భయపడుతో కూశాయి. చల్లగాలి చెమట పట్టిన వారి వొళ్ళకి తగి లింది. వెలుతురు సందేహిస్తో లోపలికి గాసులైట్ల మీదికి పాకింది. తలుపుముందు ఒక గొల్లపిల్లవాడు వొచ్చి నుంచుని తదేకధ్యానంగా వింటున్నాడు. ఒక నల్లమచ్చల ఆవూ, దూడా అతనివెనక నుంచున్నాయి, చెవులు నిక్కపొడుచుకొని వింటో. "నిన్ను చూచి ధన్యుడైతి" అనే కీర్తన యెత్తుకుని గురువుగారు ప్లాటు ఫారంమీదనుంచి లేచారు. తక్కిన యిద్దరూ వెనక లేచారు. శిష్యుడికి మెళుకువ రాలేదు. పాడుతో వెళ్ళి ఆగోవుకీ, పిల్లవాడికీ ప్రదక్షిణంచేస్తో తిరిగారు.

నిద్రపోయ్యే లైట్ల మనిషి యీగోలకి లేచి ఆశ్చర్యంతో క్లబ్బు జమానువంక బెదిరి బెదిరి చూస్తున్నాడు. యెదన్నా ఆపద తటస్థిస్తే దాక్కోనేందుకు మంచిచోటు వుందా అని చూస్తున్నట్టున్నాడు. గాసులైట్లవాడు పనిలేనిఆయన్ని డబ్బడిగాడు. ఆయన తన స్వంతం యెనిమిది రూపాయలు యిచ్చాడు. క్లబ్బు బంట్రోతు అద్దె అడిగాడు. పనిలేనిఆయన జేబులు తడుముకుని తెల్లబోయినాడు. పాడుతోనే గురువుగారు కోపంతో మెళ్ళో బంగారు రుద్రాక్ష తెంప చూశారు. కాని అది రాలేదు. మద్దెలాయన ఆయన చెయ్యి ఆపి, తన వేలి బంగారువుంగరం తీసి క్లబ్బు వాడి చేతిలో పెట్టాడు. అందరూ పాడుతో వూళ్ళోకి బయలుదేరారు. క్లబ్బు జవాను తెల్లబోయి వాళ్ళ వంక చూస్తో నుంచున్నాడు.

3 పాటకచేరీ వాళ్లు మార్కెట్టు దగ్గిరికి వెళ్లి మధ్య నుంచుని పాడడం ఆరంభించారు. పెద్ద గుంపు పోగయింది. గురువుగారు,

"సంగీత జ్ఞానవిహీనులకు మోక్షముకలదా ?"

అని యెత్తుకొని, ఆవేశంతో వూగిపోతున్నారు. పిచ్చివాడని అందరూ జాలితో తలలు వూయించారు. యెండ యెక్కింది. అయిదేసి నిమిషాలు విని పాతవారు వెడుతోంటే, కొత్తవారు వొస్తున్నారు. పదకొండింటికి వినడానికి వొక్కరూ లేరు. దగ్గిర వున్న గంపల వాళ్ళుకూడా చాలాదూరంగా జరిగిపోయినారు. పాడు

కథా నిలయం
3487

తోనే సత్రందోవపట్టారు. సత్రానికి వెళ్ళి పాటఆపి, దేహాలు గోడకి జారేశారు. అలిసిపోయినారు. నిద్ర లేదు. నిన్నమధ్యాహ్నంచేసిన భోజనం. కడుపులు మాడుతూన్నాయి. ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. అందరూ పనిలేనిఆయన మొహంకేసి చూశారు. ఆయన కన్నీరుతో తలవొంచుకున్నాడు. ఇంతవరకూ ఆపూటకి వుడకేసుకోడానికి బియ్యం లేని గతి పట్టలేదు, ఆవాళదాకా. అతని దిగులుచూసి గురువుగారు చిరునవ్వు నవ్వి,

"స్నానం చేస్తే మనకి యీ మత్తు వొదులుతుంది రండి" అని లేచారు.

దోవలో పనిలేనిఆయన "మరి యీవాళ భోజనం?" అంటున్నాడు. గురువుగారు అతన్నిచూసి నవ్వి "నీదు చరణములే గతి యని" అని మెల్లిగా పాడారు.

పనిలేనిఆయన "అన్నవస్త్రముల కేమి గతి యని యెన్నడైన నిన్నడిగినానా" అని గార్ధభస్వరంతో పాట లాగు అన్నాడు.

"పాలముంచినా, నీటముంచినా, పాదములే గతి" అని పాడారు శిష్యుడుగారు.

అతన్ని వీపుమీద తట్టి, "యిప్పుడు ముందు నీట మునిగేది నిజం" అన్నాడు మద్దెలఆయన.

"తరవాత పాలమునిగేదీ నిజమే" అని గురువుగారు అంటూవుండగానే, వెనకనెవరో పిలుస్తున్నట్టు వినపడ్డది. ఆగారు. ఒక ముసలిఆమే, ఆమె నౌకరూ

గావును రోజుకుంటో వొచ్చారు. ఆమె గురువుగారి పాదాలకి ఆ రోడ్డుమీదనే నమస్కారంచేసి,

"తమ పాదధూళిచేత నాయిల్లు ఒక్కసారి పవిత్రం చెయ్యాలి" అని ప్రాధేయ పడ్డది. అందరూ తెల్లబోయి, యిదేదో వేళాకోళ మనుకుని, సందేహంతో చూస్తున్నారు.

"సంగతంతా తరవాత మనవి చేసుకుంటా. పొద్దెక్కింది. అలసిపోయివున్నారు. రండి" అంది.

భక్తితో పొంగే ఆమెకంఠం విని, కళ్లుచూసేటప్పటికి వాళ్ళ మొహాలు విప్పారాయి.

"మధ్యాన్నంనించి తప్పకుండా వస్తాము. మరి యిప్పుడు స్నానంకాలేదు. భోజనం..." అనేటప్పటికి డొక్క లోతుకు పీక్కుపోయిన శిష్యుడికి కళ్ళనీళ్ళు తిరిగాయి. గురువుగారు అప్పుడే మళ్ళీ వెళ్ళి ఆమె యింటిలో కచేరి మొదలుపెడతారుగావునని అతని గుండెలు గబగబలాడాయి.

"స్నానానికి వేన్నీళ్ళు సిద్ధంగా వున్నాయి. యీలోపున వంటలవుతాయి. యింక మీరు మాటాడక రండి. మీకుదాసులు, అర్చకులు మొక్క డంటే అక్కడే దొరుకుతారు. పూజచేసి ధన్యతను పొందడానికి మీవంటి మహాత్ములు నా కెక్కడ దొరుకుతా" రంది.

నలుగురిలో యిద్దరు బ్రాహ్మలు, ఒకడు నాయుడు...సందేహించాడు. ఆకలిమాత్రం పీకుతోంది.

"సందేహించకండి. బ్రాహ్మలే వంటచేస్తారు. రండి" అంది.

శిష్యుడి మొహంలో నురుగులాగ చొంగ బయలుదేరింది. డమడమా కొట్టడానికి మద్దెలయ్య మద్దెల వెతుక్కున్నాడు. గురువుగారు,

"నీ నామ రూపములకు నిత్యాజయ
మంగళం' అనుకుంటో నడిచారు.

4 ఆమె వాళ్ళనో పెద్దమేడలోకితీసికెళ్ళింది. నలుగురికీ సలక్షణంగా తలంట్లు పోయించి, కట్టుకోడానికి పెద్దపెద్ద బనారసు బట్టలు యిచ్చారు. అందమైన సావిట్లో, వెండిచెంబులుపెట్టి, అరిటాకులు పీటలముందు వేసి సిద్ధంగావున్నాయి. పిండివంటలతో కూడా. మద్దెలయ్య పెరుగుఅన్నం సగం తింటో పీట మీద పడిపోయినాడు. మేడమీద పువ్వుల తొట్ల మధ్య, చల్లగాలిలో మడతమంచాలమీద, తెల్లని దుప్పట్లు పరచి వాటిమీద వాళ్ళని పడుకోమన్నారు. గురువుగారికి కాళ్ళూ, మదెలయ్యకి చేతులూ నౌకర్లు పడుతున్నారు. నా "మెడకాయి సంగతి యెవరికీ తెలీదా" అనుకున్నాడు పనిలేనిఆయన. తాంబూలా లేసుకొంటో కళ్ళుమూశారు.

లేచేటప్పటికి రాత్రి తొమ్మిదయింది. వెంటనే కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చి భోజనాలకి లెమ్మన్నారు. తివాసీలమీద గాసులైట్లముందు తాంబూలాలు వేసుకొంటో కూర్చుని, 'యీ అదృష్టమంతా నిజమా,

కలా'అని ఆశ్చర్యపడుతో వుండగా, మళ్ళీ ఆముసలామె కనపడ్డది. ఆమె వెంట ఆమె కూతుళ్ళని యిద్దరిని తీసుకొచ్చింది. ముగ్గురూ గురువుగారి పాదాలకి నమస్కారం పెట్టి కూచున్నారు. అప్పుడు ముసలామె మాట్లాడింది:

"అయ్యా, మీరు మాయింటిముందునించి తెల్లారే పాడుతో వెళ్ళారే, అప్పుడు మీ పాట విన్నాను. అటువంటిసంగీతం నేను విని ముఫ్ఫైయేళ్ళయింది. అది వొక మహాతేజస్వి, అవతారపురుషుడు పాడాడు. అప్పుడు నేను నిండుయవ్వనంలో, ఒక జమీందారుగారి ఆదరంలో వున్నాను. యీ సంపద అంతా ఆయనకటాక్షమే. యేనాడు పాటకచేరీలో తెరచాటున నుండి ఆయనపాట విన్నానో, ఆనాడే నాహృదయాన్ని ఆయనకాళ్ళముందు పారేశాను. నా కొక హృదయముందనీ అది శాశ్వితమైనదనీ అంతవరకు తెలీదు. రహస్యంగా ఆయనకి కబురుపంపి నా జీవితం ఆయనకి అర్పించాను. ఆయనకికూడా నన్ను చూచి ఆదరం కలిగింది. నే నేమీ అన్యాయం చెయ్య లేదు. జమీందారుగారితో చెప్పేశాను. యేం జరిగిందో తెలుసునా? ఆయీశ్వరీసమానుణ్ణి, సహవాసంగా అడివికి పిలుచుకుని వెళ్ళారు జమీందారుగారు. ఆయన యేమైనాడో యింతవరకు తెలీదు. ఆయన గానమాధుర్యంలో లీనమైన నా మనసు యీనాటి వరకు కళ్లు తెరవలేదు.

"యీనాడు విన్నాను, మళ్లీ అటువంటి గాంధర్వ ప్రజ్ఞావి శేషము.

"యిప్పుడందరూ పాడేవాళ్లే. కాని ఒక్కడికీ సంగీతజ్ఞానం కొంచెమన్నా వుందా? పోనీ అభిమానముందా? పోనీ సంగీతానికీ, గొడ్డుఅరుపులకీ భేదం తెలుస్తుందా? జరిగిందంతా విన్నాను. మీరు పాడే విశ్వమోహనగానం యీపాడువూళ్లో యెవరి కర్థమవుతుంది? యే కూనిరాగాలో, హిందూస్తానీ టప్పాలో కొట్టేస్తే, తమరిని ఆకాశానికి పొగిడేసి, ప్రతివెధవా బ్రహ్మరథం పట్టేవాడే!"

తన కూతుళ్ళని చూపి, "వీళ్ళకి సంగీతం యెంతో కష్టపడి నేర్పాను. ఒక్కరోజు సాధకం మానారా ఆరోజు వీళ్ళ మొహం చూడను. యీవాళ మీరు అలిసివున్నారు. పాడమని అడగను. కనక యీదాసురాళ్ళ పాట విని తప్పులు క్షమించాలి" అని వాళ్ళిద్దరిచేతా పాడించింది.

మర్నాటినించి గురువుగారిచాత పాడించడం, తను ఆనందించడమే ఆమెపని. ఇట్లా నాలుగురోజులు గడచినతరవాత, అక్కణ్ణించి కదలడానికి యెంతయిష్టం లేకపోయినా, యింక బావుండదని, వెడతా మన్నారు. శిష్యుడుమాత్రం తను శాశ్వతంగా అక్కడే వుండిపొయ్యే వుపాయ మేదన్నా వుందా అని ఆలోచిస్తున్నాడు. కాని ఆమె వాళ్ళని బలవంతంచేసి, యింకొక పదిహేనురోజు లుంచింది. శిష్యుణ్ణి ఆమె వొక్కసారి కూడా పాడమని అడగనందువల్ల వుండిపొయ్యేఆశలు అణగారిపోయినాయి అతనికి. తాంబూర మీటడంలో అతని ప్రజ్ఞావిశేషాన్నికూడా ఎవరూ గమనించ లేదు.

వాళ్లు వెళ్ళేరోజున వెండిపళ్లెంలో ముప్ఫై మొహరీలు పోసి గురువుగారిముందు పెట్టి, నమస్కారంచేసి, పట్టు తాపితాలు కట్టబెట్టింది. తక్కినవారికి ఒక్కొక్కరికి తలో యాభైరూపాయలిచ్చింది. పనిలేనాయనకి కూడా.